

ప్రణయ తాండవం                చిత్రం—మల్లీశ్వరి (తణుకు)

చిన్న కథ

# ఎర్ర కలువ

ఎ. వి. జగన్నాథం

ఆ పాడుదేవాలయం అరుగుమీద నేను, రామలింగేశ్వరరావు చతికిల పడ్డాం. ముదురాకు పచ్చ రంగునాచుతో, బీటలువారిన గోడలతో, తలుపులు ద్వారంలేని గర్భగుడితో, విరిగిన పాణవట్టంలో అంటీ అంటకుండా ఉన్న లింగంతో, ఆగుడి జీర్ణ శిధిలావస్థ సాధారణంగా ఎవరినీ ఆకర్షించదు గాని, ఉదయం నుంచి ఏకబిగిని నడిచిఉన్నామేమో, ఎప్పుడు నడుం వాలుద్దామా అని ఉంది ప్రాణం. దూరంగా వినిపిస్తున్న రొద ఐదు నిమిషాల క్రిందట మేము దాటవచ్చిన కొండజల హోరే అయిఉంటుంది. ఆలయానికి చుట్టూ అడ్డదిడ్డంగా పెరిగిన అడవి మామిడిచెట్లూ, శంఖాల వంటి పువ్వులతో నిండిన నూరు వరహాల చెట్లూ ఉన్నాయి. తురాయి పిట్టలూ, నల్ల పిచ్చుకలూ మమ్మల్ని ఒక్కసారి పలకరించి పరిచయమైనట్లుగానే భావించి తుర్రుమన్నాయి.

ఇంతట్లో కొండ కూలివాడు మా భోజన సామగ్రిని, కేంపు మంచాలను మోసుకొనివచ్చి, 'బాబూ, రేత్రికి యిక్కడే తొంగుంటారా?' అనడిగేడు. రామలింగేశ్వరరావు, 'ఆ పల్లె కొంపలకన్న యీ పాడు గుడేమేలు. కొండదొర బంగాళాఉందిగాని, రాత్రల్లా శాకినీ, ఢాకినీలతో జాగారం చేసేకన్నా చల్లగా యిక్కడ కునుకు తీద్దాం' అన్నాడు. కొండవాడేమీ మాట్లాడకుండా తన పనులు చేసుకోవడంలో నిమగ్నుడయేడు.

రామలింగేశ్వరరావు కలెక్టరాఫీసులో పెద్ద గుమాస్తా. గంటాడలో ఎల్లుండి కలెక్టరుగారి రాకకు సదుపాయాలు చూడడానికి టూరు తగిలిందీవేళ. నేను క్రొత్తగా నాల్గవ తరగతి చిన్న గుమాస్తాగా జేరే నీమధ్యే. 'రావోయ్, నీకు మన్య ప్రాంతాలూ, అక్కడి వింతలూ చూపిస్తాను. మన భద్రయ్య బడివేటు ఊష్ణంతో రెండు దినాలాయె ఆఫీసుకు రాలేదు. కాబట్టి నిన్ను వానికి బదలాయింపుగా వ్రాసి బత్తా ముట్టజెబుతాలే' అన్నాడు రావు. 'సరే. బ్రహ్మచారి మర్కటం పట్నంలో ఉంటేనేం పల్లెలో ఉంటేనే' మనుకొని 'మంచిది రావుగారూ' అని సమాధానమిచ్చేను.

చీకటిపడింది. హరికేన్‌లాంతరు వెలిగించేను. ఇంతలో కొండవాడు అడవినుంచి ఏరుకొచ్చిన ఏవో ఆకులతో ఎదురుగా భోజనం అమర్చేడు. రామలింగేశ్వరరావు భార్య మంచి వంటకత్తెలాగే ఉంది. పులిహోర, ఉల్లిగారెలు, వెల్లుల్లి వేసిన ఆవకాయ, పెరుగన్నం ఉన్నాయి. చెప్పొద్దూ, నోరూరింది. 'కానీవోయ్' అన్నాడు రామలింగేశ్వరరావు. ఇంకేముంది? 'స్విచ్ ఆన్' చేయగానే గడగడ తిరిగే యంత్రంలా పని చేసేను. గర్రున త్రేన్చి, పట్నం నుంచి తెచ్చు కొన్న తాంబూలం బిగించి ప్రక్కల మీద వాలేం.

హరికేనులాంతరున్నదన్నమాటేగాని, దాని వెలుగు దాని దగ్గరే ఉంది. ఇద్దరం యిటూ, అటూ దొర్లుతున్నాం. అలసట హెచ్చయినందునేమో, భోజనం చేసి ఒక గంటయినా నిద్ర పట్టలేదు. పైగా, నాకు చలివేయసాగింది. 'రావుగారూ, చలిగా ఉందిక్కడ. కాగా, పాడు దేవాలయం కొంచెం లోతైన స్థలంలో ఉందేమో, తేమగా కూడా ఉంది. మనం ఒక ఫర్లాంగు దూరం యింకా నడిచి ఆ కొండదొర యిల్లున్నారే, దాంట్లోనే రాత్రిగడపడానికి నిశ్చయించిఉంటే బాగుండేది' అన్నాను. 'చంపేవోయ్. ఆ దయ్యాల కొంపలో ఎలా వేగుతామోయ్? నీకు క్రొత్త గాని నేనీ ప్రాంతాలవాడినేగా? మా తాతగారి రెండోభార్య పుట్టిల్లు గంటాడే. నేను చిన్నప్పుడే యీ కథ విన్నాను. జడుసుకోకపోతే చెప్తా'నని నా సమాధానం గురించి ఎదురు చూడకుండానే మొదలెట్టాడు రామలింగేశ్వరరావు.

• • •

గంటాడ అగ్రహారంలో ఆ రోజుల్లో సుబ్బయ్యశాస్త్రిగారంటే అందరికీ గౌరవంకన్న భయం హెచ్చు. బట్టతల, చెవులకు దగ్గరగా

జారిన తెల్లని కోడీకల లాంటి వెంట్రుకలు, పెద్దసిగముడి, చెవులకు బంగారు కుండలాలు, నుదుటికి విభూతి చారలు—వీటన్నింటితోటీ నిబ్బరంగా కనిపించేవాడు. ఆయనకు మొదటి కళత్రం నలభై ఏళ్ళ నడి వయస్సులో పోయింది. సంతానం గురించి, ధర్మ కార్యాలకోసం ద్వితీయం చేసుకొన్నాడు. ఆమె ఒక సంవత్సరంలో గర్భిణీగా మారి, ఒక ఆడపిల్లను ప్రసవించి చని పోయింది. సుబ్బయ్య విచారం పట్టలేక, పసి గుడ్డును బంధువులకు అప్పజెప్పి, బ్రహ్మ కపాలంవరకు యాత్రలు చేసి, ఒక సంవత్సరం తర్వాత తిరిగి వచ్చేడు. మనిషి బాగా బడుగయేడు. నుదుట ఎర్రగా పెద్దకుంకమ బొట్టొకటి హెచ్చిందిపుడు. అసలే నిష్ఠాపరుడేమో, ఇప్పుడు మరీ చాదస్తం ముదిరింది. తన పిల్లకు లలిత అని పేరు పెట్టి ముద్దుగా చూచేవాడు. అను దినం ఉదయం నుంచి అపరాహ్ణమయేవరకూ ఏవో సహస్రనామపూజలూ, హోమాలూ చేసేవాడు. ఇలాగ పదకొండేళ్ళు గడిచేయి.

ఆ రోజుల్లో మనం విశ్రమిస్తున్న యీ దేవాలయం మాంచి దశలో ఉండేది. దీనికి దగ్గరగా తామరపూలతో కలకలలాడుతూ ఒక చిన్నగుంట ఉండేది. దానిలోకి నీరు మనం సాయంకాలం చూచిన వాగులోంచి వచ్చి పడుతూ పోతూండేది. కపాలేశ్వరాలయం కాబట్టి ఈ పల్లెకు కపాలపాడని పేరు. ఈ పల్లెలో ఒక కొండదొర జమీందారుగా ఉండేవాడు. వాడు క్రూరుడు, నిర్దయుడు. యౌవన మదం, ధనగర్వం అండగా వాడిదుష్కీర్తి చుట్టు ప్రక్కల గ్రామాలన్నిటికీ నల్లని పొగలాగ దట్టంగా వ్యాపించింది.

శ్రావణ పూర్ణిమకు గంటాడ తోటలో ప్రతి ఏటా పెద్దమేళం జరుగుతుంది. చుట్టుప్రక్కల ఊళ్ళలో నుంచి కూడా పెద్దలు, పిన్నలు వచ్చే వారు. ముత్తయిదువలు, పెండ్లికాని పిల్లలు గాజుల దుకాణాల్లో, జడబంతులమ్మే వాళ్ళ దగ్గర, రంగులరాట్నం ప్రక్కన, గడసాని గారడీ స్తంభానికెదురుగా చెట్టపట్టాలు కట్టుకొని తిరిగేవారు.

అది రౌద్రినామ సంవత్సరమనుకొంటాను. శ్రావణపూర్ణిమ నాడు మేళం ఘనంగా జరుగు తున్నది. లలిత ఆ వెన్నెల పాలసముద్రంలో పుట్టిన వయస్సు నురుగులా ఒక చోటినుంచి మరొక చోటికి తన స్నేహితురాలు రామావధానుల గారి కూతురితో తిరుగుతున్నది. మర్రి చెట్టుక్రింద కోడిపందేలూ, జువ్విచెట్టుక్రింద గొర్రెలపందేలూ చూచి, ప్రక్కన మామిడి తోపులో కొండదొర ఉత్సాహంతో పాల్గొంటున్న ఆంబోతుల దెబ్బలాట చూడడానికి బయలు దేరేరు స్నేహితురాండ్రిద్దరూ.

అక్కడికి వెళ్ళినప్పుడే కొండదొర కంటిని చెదర గొట్టింది లలిత.

కొండదొర తన బానిసీడు పాపయ్యకు కను సైగ చేసేడు. వాడు మెల్లగా దొరదగ్గరికి

# నైవేద్యము

## [మధ్యాక్కరాష్టకము]

### బండి నాగరాజు

శ్రీదేవి నురమందుఁ దాల్చి శేషగిరీంద్రమ్ము పైని
మా దీనతల నెల్లఁ బాపి, మ మ్మేల నిలుచుంటి, నీదు
పాదాలె దిక్కంచు నెంచి భావాన నిను నిల్పుకొంటిఁ
జేఁదుకో!-నినుఁజేర నుంటి; శ్రీ వేంకటేశ్వరా, స్వామి!

దేవుండవని కొంద అంద్రు; దేవి వంచును గొంద అంద్రు;-
దేవదేవులమధ్య నేమి తేడాయొ? యెఱుఁగంగఁ జాల!-
నీ వుంటి వదె చాలు నాకు, నే రూప మైన నే మిపుడు!?
సేవింపఁ గూర్చుంటి నంతె; శ్రీ వేంకటేశ్వరా, స్వామి!

ఈ మెట్టు లన్నియుం దాఁట, నేతెంచినట్లు గన్పించి,
మా మొఱ్ఱ లాలకించి, దయ మన్నింతు: జన్మంపు మెట్లు
ఏ మెల్ల దాఁటిన, మాకు నే రూపమున దర్శన మిడి
సేమమ్ము లెట్టి విచ్చెదవా? శ్రీ వేంకటేశ్వరా, స్వామి!

హృదయపుఁ గుటీర మిదె చూడు!-మేలాగు బూజుతో నిండి,
కదలు చున్నదొ కట్లు త్రెస్సి;-కాదు నాచే శుభ్రపఱుప:
ఇదె వ్రాసి యిచ్చుచున్నాఁడ, నింక నీ చిత్తము, నన్ను
వదలించుకోనిమ్ము దీని-వడి! వేంకటేశ్వరా, స్వామి!

ఓ సామి! నీ కేమి యియ్యనోపుదునో, జగత్పతివి!
కాసులు గీసులు నీవి కాక నా వని యేడఁ గలవు?-
తీసికొమ్మందు నా హృదిని? దేవర "కప్పు" నా బ్రతుకె!
చేసిన పాపమే నాది!! శ్రీ వేంకటేశ్వరా, స్వామి!

అడుగడ్డు దండాలవాఁడ! ఆపద మ్రొక్కులవాఁడ!
వడిగ రప్పించుకొనువాఁడ! వడ్డికాసులవాఁడ! తండ్రి!
ముడుపు గట్టితిని "పాపాల-మూట", గైకొమ్ము గోవింద!
గొడవలన్నియు నీకె-యివ్విగో! వేంకటేశ్వరా, స్వామి!

ఓ సామి! కలియప్ప! కాన్క లొసఁగంగ వచ్చుట లెల్ల
నీ సొగసు గాంచనా యేమి? నీటుకాఁడా! చెప్పెద, విను-
శ్రీసతి భర్తవుగాన, సిరు లిత్తువని వచ్చినాము
చే సాపి యడుగ; గుట్టింతె! శ్రీ వేంకటేశ్వరా, స్వామి!

చేఁదుకో! చేఁదుకో! స్వామి! చేఁదుకో! యీ చిత్త మింక
నీ దివ్య కృపచేతఁ గాని, నిశ్చల తత్త్వమ్ముఁ గనదు;
ఈ దిక్కులేని చిత్తమ్ము నే భరియింపఁగా లేను,
చీఁదలిం పాయె నిప్పటికె! శ్రీ వేంకటేశ్వరా, స్వామి!

జరిగేడు. దొర పాపయ్య చెవిదగ్గర ఏదో గుసగుసలాడేడు.

అంబోతుల దెబ్బలాట మంచి రసకందాయంలో ఉండగా ఆ మామిడి తోపులో మరొక ప్రక్క సన్నాయి, టకోరా మేళం పాటలు వినిపించేయి. ఈ గుంపులోనుంచి చాలమంది ఆ దిక్కుకు పరుగెత్తేరు. లలిత కూడా పరుగు దీసింది. అక్కడ ఉన్న విచిత్రమేమిటంటే రంగురంగుల గుడ్డలతో సింగారించిన పాలకీలు మూడున్నాయి. ఒక్కొక్క పాలకీకి నలుగురు మోసేవాళ్లున్నారు. టకోరా ప్రశావ్యంగా వాగుతున్నది. ఒక కొండ వాడు డప్పుకొడుతూ 'పెళ్లికూతుళ్ళాట ఆడే వారు, కానీ కానీ యిచ్చి సవారీ ఎక్కండోయ్' అని అరుస్తున్నాడు. ఇద్దరిని ఒక్కొక్క పాలకీ ఎత్తుకొంటున్నది. ఒక సవారీలో లలిత, స్నేహితురాలు ఎక్కేరు.

మర్నాడు ఉదయం నిద్రలేక, అలసటతో ఎర్రబడిన కళ్ళతో సుబ్బయ్యశాస్త్రి గోళెమట్టు రాతిమీద కూర్చొన్నాడు. రామావధాని శాస్త్రి కెదురుగా ఉన్న చిన్న రాతిమీద కూర్చొని ఉన్నాడు. 'అయితే మేళానికి పోయిన యిద్దరమ్మాయిల మీద మన మాశవదలుకోవలసిందేనా? అందరూ చెప్పిన మాటల్ని బట్టి సవారీ ఆటలో పల్లకీని పిల్లలిద్దరూ ఎక్కినట్లు తేలింది. గవిరిగాడు పట్నం నుంచి ఆలస్యంగా బయలుదేరి వున్నమ రాత్రి పుచ్చపూవులాగున్నది కదా అని మేళం చూడవచ్చునన్న ఉబలాటంతో నరానరిని వస్తూ కపాలేశ్వరాలయం దగ్గర ఏదో పల్లకీని చూచేడని యిప్పుడేకదా శరభయ్య చెప్పిపోయేడు' అన్నాడు రామవధాన్లు. 'మనం ఒకసారి కొండదొరని చూచివద్దాంపద' అని లేచేడు సుబ్బయ్యశాస్త్రి.

శాస్త్రి, అవధాని కొండదొర యిల్లు చేరుకొనేసరికి మధ్యాహ్నమయింది. వీరిద్దరినీ చూచి పాపిగాడు'రాత్రల్లా మేళంలో దిరిగి దొర పడుండా' డని చెప్పేడు. శాస్త్రి 'ఒక అవసర కార్యం మీద వచ్చేమురా వెధవా. ఇష్టం వచ్చినట్లు పేలక దొరతో వెంటనే పోయిచెప్పు' అని కసురుకొన్నాడు. పాపిగాడేదో సణుగుకొంటూ లోపలికి వెళ్లగానే, అవధాని, 'ఈ పాపిగాడు దుష్టుడు. వీడిమీద మాట చేసుకోవడం ముప్పు తెచ్చుకోవడమే' అన్నాడు. శాస్త్రి, 'పిల్లకి నశించిపోయేకాలం వచ్చింది. లేకపోతే నన్ను దుఃఖపెట్టేదశ ఎందుకు రావాలి?' అన్నాడు.

పాపిగాడు వచ్చి, 'దొరలేచిండు, రాండి' అన్నాడు. దొర బల్ల ఉయ్యాల మీద కూర్చొని ఉన్నాడు. వీరిద్దరిని చూచి వాడు లేచి నిలబడి 'రండి సుబ్బయ్యగోరూ. మా యిల్లు పావనమై పోనాది. నేనెంజెయ్యాలో సెలవీయండి'అన్నాడు. 'నా కూతురు నిన్నరాత్రి మేళానికి యీ రామావధాన్లు కూతురుతో కూడా వెళ్ళింది దొరా. మరి రాత్రి యింటికిద్దరూ రాలేదు. పాలకీ ఆటలో సవారీ పిల్లలిద్దరూ ఎక్కినట్లు నాకు

# ఎర్రకలువ

అందరూ చెప్పేరు. ఒక సవారీని నిన్న రాత్రి గొరిగాడు కపాలేశ్వరాలయం వద్ద చూచినట్లు చెప్పేడు. నీకేమేనా యీ విషయం తెలుసునేమోనని కనుక్కొందుకు వచ్చా'నన్నాడు సుబ్బయ్యశాస్త్రి.

'అర్రెర్రె, ఎంతపని జరిగినాది? రాతిరేళ పిల్లల్ని తోడునేకుండా మేళానికెలా పంపించినావు సుబ్బయ్యగోరూ? ఇంతకీ ఆతోటనిండా కొండ దయ్యాలుంటయే. ఏ యక్షిణో సవారీని ఎత్తుకొచ్చి కపాలేశ్వరుడి గుడి కాడ పూజకి నిలిపి పోయిందేమో? ఎదవ సచ్చినోడు, గోరిగాడు సవారీ ఎంట బడనేదు, బతికిపోయిండు' అని మథనపడ్డాడు కొండదొర.

'నీ వల్లకాదు. దయ్యాలేమిటి, యక్షిణీలేమిటి? నీవేమేనా సహాయం యీ విషయంలో చేయగలవని వస్తే మాతో పరాచికాలా?' అన్నాడు రామావధాని.

'అవధాన్లూ, నువ్వు కొంచెం ఉండు. వీడు నాకు జ్ఞాపకం తెచ్చేడు. లలిత నాదేవి. నిత్యం ఆరాధించే దేవత' అని ఒక్కసారిగా శాస్త్రి ముఖం జేవురింపజేసికొని భయంకరంగా ఏదో అనేసరికి అక్కడ ఉన్న రోలు అమాంతం మీదికి గాలిలోకి లేచి కొండదొర ఊగుతున్న ఊయల ముందు పెద్ద శబ్దంతో పడింది. రామావధానుల్ని, కొండదొరను, తలుపు ప్రక్కనున్న పాపిగాడిని భయమావహించింది. పాపిగాడు, 'పాపం చేసినావు దొరోయ్' అని అరచి బయటకు పరుగెత్తేడు.

'దొంగ గాడిదకొడకా, ముక్కు పచ్చలారని మాబొట్టెల్ని నీ పొట్టబెట్టుకున్నావా? నీచుడా, వాళ్ళ ఉసురు నీకు తగలడానికి ఎంతో వ్యవధి లేదు' అని శాస్త్రి అవధానులతో కపాలేశ్వరాలయానికి నడిచేడు.

ఆలయంలో అప్పుడెవరూ లేరు. పూజారి తలుపులు బిగించికొని యింటికి పోయినాడు.

## రాజకీయ బేతాళ పంచ వింశతిక

అనివార్యమైన కారణాలవల్ల ఈ సంచికలో శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ రచన 'రాజకీయ బేతాళ పంచ వింశతిక' ప్రచురించ లేక పోయినందుకు చింతిస్తున్నాము.

—ఎడిటర్.

సుబ్బయ్యశాస్త్రి ప్రక్కనున్న గుంటలో స్నానం చేసి వచ్చి ఆలయ ద్వారం దగ్గర కూర్చొని జపం చేయడం ఆరంభించేడు. రామావధాన్లు ఏమీ తోచక నెత్తీ, నోరూ బాదుకొంటున్నాడు.ఇంతలో ఆకస్మికంగా ఒక పెద్ద శబ్దం పుట్టి తలుపు తాళం విరిగింది. పెద్దగాలి వచ్చితలుపుల్ని ధడాలున తెరచింది. శాస్త్రిలేచి లింగం దగ్గరకుపోయి దానిమీద తల బ్రద్దలు కొట్టుకొన్నాడు. ఆ దృశ్యం చూడలేక పిరికి గుండెగల రామావధాని గుండె ఆగింది.

సాయంకాలం అయేసరికి అందరి నోటిలోనూ యీ కథ ఉంది. కాని కొండదొర భయం చేత ఎవరూ ఉలకలేదు. అసుర సంధ్యవేళ కొండదొర షికారు బయలు దేరి ఆలయం ప్రక్కన ఉన్న గుంట దగ్గరికి వచ్చేసరికి దాని ఒడ్డున వానికొక ఎర్ర కలువ పూవు కాన్పించింది. దానికి భ్రమసి, చేతితో తీసి, దొర వాసన చూచుకుంటూ తిరిగి వస్తూ ఉండగా పాపిగాడు కనుపించి, 'దొరా, మానిసి ఎముకెందుకు ముక్కుకాడుంచుతున్నా' వన్నాడు. 'ఏరా కళ్ళు కనబడలేదు ? చెంగల్వని బొమికంటావు?' అన్నాడు దొర. 'ఓరిబాబూ, దొరని యక్షిణీ పట్టిందో' అని అరుస్తూ పాపిగాడు పరుగెత్తుతూ ఒకపాము మీద కాలేసేడు. అది త్రాచుపామేమో, వెంటనే పాపిగాడు చొంగ క్రక్కుతూ నేల కూలేడు.

ఆ మర్నాటినుంచి కొండదొర ఎవరికీ కనబడలేదు. కొండదొర యింటిని వాని అప్పులందరూ ఒకరొకరుగా వదిలేసేరు. రాత్రివేళ కొండదొర బంగళాలో ఏవో ఉయ్యాల లూగుతున్నట్లు, రోళ్లు కప్పు మీద నుంచి క్రిందికి పడ్డట్టూ, త్రాగుబోతు వికవిక నవ్వుతున్నట్లూ, దిక్కులేని పిల్లలు దీనంగా, బాధగా ఏడుస్తున్నట్టూ ఉంటుంది.

* * * *

ఈ మాటలు చెబుతూనే రామలింగేశ్వరరావు నిద్రాదేవి ఒడిలో పడ్డాడు. నాకు మత్తెక్కినట్లుయింది. బయట కారు చీకటి. ఏవో అడవి చప్పుళ్లు. భేతాళ కథలూ, బృహత్కథలోని శాకినీ, ఢాకినీ, పిశాచాలూ నా మెదడులో చరచర ప్రాకేయి. ఆలోచిస్తూ దిగులుగా పడుకొన్నాను. పీడకలలతో నిద్ర పట్టింది.

మర్నాడు ఉదయం నా కళ్లు విడేసరికి లేత ఎండ కిరణాలు మామిడాకుల సందులలో నుంచి తొంగి చూచినాయ్. పిట్టలు వింత ధ్వనులు చేసినాయ్. నా మత్తువదిలి నిజ ప్రపంచానికొచ్చినట్లుయింది. కొండవాడు 'స్టౌ' మీద టీ చేసి ప్రక్కల దగ్గరకు తీసుకొని వచ్చేడు. తియ్యని టీ చప్పరిస్తూ, 'నిన్నరాత్రి నిద్రబాగా పట్టిందోయ్' అని రామలింగేశ్వరరావు అడుగుతున్నప్పుడు ఆ కన్నులలో చిలిపితనంతో కూడిన ఉల్లాసం మెదిలిందా అనిపించింది నాకు. ★